
గొట్లగట్టు బీసీకాలనీ వీధిలో ఇలా..


పెదారికట్లలో వర్షానికి రోడ్ల దుస్థితి..

# రోడ్లన్నీ జలమయం

మార్కాపురం/కొనకనమిట్ల: మార్కాపురం నియోజకవర్గంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మార్కాపురం పట్టణంతో పాటు రూరల్‌లోని పలు గ్రామాల్లో, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, తదితర మండలాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. పలుచోట్ల పొలాల్లోకి వర్షం నీరు చేరింది. ఇటీవల సాగు చేసిన మిర్చి, పత్తి, పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు.

**మండలంలో తేలికపాటి వర్షాలు**

**రాచర్ల:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. పొగాకు, కంది, మిరప, పత్తి పంట పొలాలకు ఈ వర్షం మేలు చేకూరుతుందని రైతులు తెలిపారు. మోస్తారు వర్షాలు కాకుండా భారీ వర్షాలు కురిస్తే రైతులు తీవ్ర నష్టం వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**వర్షానికి జలమయమైన వీధులు**

**గిద్దలూరు రూరల్:** వర్షం కారణంగా నగర పంచాయతీ కార్యాలయంతో పాటుగా అంకాలమ్మ బజారు, కోటగడ్డ బజారు జలమయమయ్యాయి. డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా వర్షపు నీరు అంతా లోతట్టుగా ఉన్న ప్రదేశాలల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగర పంచాయతీ ప్రధాన రహదారి నుంచి వచ్చిన వర్షపు నీరు కార్యాలయం ముందు భాగంలో నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఆ వీధుల మీదుగా నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అర్బన్ కాలనీ, రాజానగర్, రాచర్ల రోడ్డులోని మార్కెట్‌యార్డు సమీపంలోని వీధులు, నల్లబండ బజారు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కాలనీవాసులు బురదమయమైన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


మార్కాపురం : కొండేపల్లి రోడ్డులో నిలిచిన వర్షం నీరు


గిద్దలూరు రూరల్: అంకాలమ్మ బజారులో జలమయమైన రోడ్డు


వర్షానికి రాలిన పత్తికాయలను చూపిస్తున్న రైతు వెంకటేశ్వరరెడ్డి


గిద్దలూరు రూరల్: జెడ్పీ హైస్కూల్ వద్ద రోడ్డు మీదకు వచ్చిన డ్రైనేజీ నీరు


గొట్లగట్టు బస్టాండ్ సెంటర్‌లో కుంటను తలపిస్తున్న రోడ్డు

## సంక్షిప్తంగా

### తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

**రాచర్ల:** రాచర్ల తహసీల్దార్‌గా లోకసాని వెంకటేశ్వర్లు సోమవారం పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఎలక్షన్ సమయంలో తహసీల్దార్‌గా పనిచేసిన డి.వెంకటేశ్వరరావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ భారతిబాయ్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేశారు. అర్థవీడు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న లోకసాని వెంకటేశ్వర్లును ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

### అవినీతి అధికారులను పట్టించి బహుమతి పొందండి

**గిద్దలూరు రూరల్:** అవినీతి అధికారులను పట్టించి తగిన బహుమతి పొందాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది మదిరె రంగసాయిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లంచం తీసుకునే పంచాయతీ స్థాయి ఉద్యోగిని ఏసీబీకి పట్టించిన వారికి రూ.10 వేలు, మండల స్థాయి అధికారిని పట్టించినట్లయితే వారికి రూ.25 వేలను ప్రజా సంకల్ప వేదిక వారికి బహుమతిగా అందజేస్తుందని ఆయన తెలిపారు. ప్రజలు అవినీతి అధికారుల పని తీరును అడ్డుకునే దిశగా అడుగులు వేయాలని ఆయన కోరారు.

### గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

**గిద్దలూరు రూరల్:** కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామ పంచాయతీలోని ఉప్పలపాడు గ్రామంలో సోమవారం సిమెంట్ రోడ్డు పనుల కోసం శిలాఫలకం ఆవిష్కరించారు. మొత్తం రూ.50 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బుడత మధు, గ్రామ సర్పంచి ఎలిజబెత్, ఈఓఆర్డీ చెన్నారావు, అధికారులు పాల్గొన్నారు.

### వర్షంలోనూ నిరసన తెలిపిన కార్మికులు



నిరసన తెలుపుతున్న కార్మికులు

**మార్కాపురం టౌన్:** మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వర్షంలోనూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ కార్మిక చట్టాలను పాటించకుండా ఏకపక్షంగా కార్మికులను అధికారులు తొలగించడాన్ని ఖండించారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సుమారు 21 మందికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడాన్ని వ్యతిరేకించారు. నిరసన పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలువురు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

### పల్లెపండుగలో అభివృద్ధి పనులు చేపట్టాలి

**కొమరోలు:** పల్లె పండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కొమరోలు మండల ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు పల్లె పండుగ వారోత్సవాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో అంతర్గత సీసీ రహదారుల నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ఈరయ్య, ఈవోపీఆర్డీ బ్రహ్మయ్య, ఏపీవో మహాలక్ష్మి పాల్గొన్నారు.

### వాసవీమాతకు ఘనంగా నగరోత్సవం

**మార్కాపురం టౌన్:** స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో వెలసిన శ్రీ వాసవీమాతకు సోమవారం రాత్రి ఘనంగా పులివాహనంపై నగరోత్సవం నిర్వహించారు. వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. రథాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవానికి ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రాజాజీవీధి, మెయిన్ బజారు, గాంధీ బజారు, నెహ్రూ బజారు, నాయుడువీది, తేరు బజారు మీదుగా ఊరేగింపు జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, రామడుగు రమేష్, సూరె వెంకట సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### సజ్జ పంటలో జడలు కట్టాలి

**బేస్తవారిపేట:** కోత దశలో ఉన్న సజ్జ పంటలో జడలు కట్టడంతో వర్షాలకు పంట దెబ్బతినకుండా ఉంటుందని వ్యవసాయశాఖ ఏడీఏ డీ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని గలిజేరుగుళ్ల, కోనపల్లెలో సోమవారం పంటలను పరిశీలించారు. వర్షం నీరు పొలాల్లో నిల్వ ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ జాబితాలో ఏవైనా తప్పులుంటే రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని కోరారు. రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.


సజ్జ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్